# అమ్మ డైరీలోంచి...

మాతృదేవోభవ అంటే తెలుసా?
పుట్టేముందు నెత్తురుపంచి...
గిట్టేముందు ఆస్తులు పంచి...
పెంపకానికి... పంపకానికి
మధ్యన నలిగే వ్యధార్థ దేంతలం !!

★ ★ ★

వాడు బుడిబుడి నడకలతో
మొదటిసారి 'అమ్మా' ని పిలిచినప్పుడు
వాడిలో 'గోర్కీ'ని చూసాను...
వాడు గుండెలమీద తన్ని ముండా అంటూ
గోరీ కట్టేరోజు... కొడుకునే చూసాను.

★ ★ ★

అవ్వలోంచి అమ్మలోకి...
అమ్మనించి మమ్మీలోకి... రూపాంతరం చెందుతూ
వాడి భార్యరాకతో బతుకంతా 'డమ్మీ'గా మిగిలాను.

★ ★ ★

కళ్లలోయల్లోన దిగులున్నా...
గుండె గోడల్లో కన్పించని పగుళ్లున్నా...
కనుకొనుకుల్లో కన్నీటి నెగళ్లున్నా...
నివురు కప్పిన క్షతగాత్రాన్నయినా
నిప్పులు కక్కని నక్షత్రాన్నిరా... అమ్మని రా !!

★ ★ ★

బాలికగా పుట్టినప్పుడే దుఃఖం
బాలింత నొప్పులప్పుడూ దుఃఖం
మా దుఃఖం ... మగజాతికి
కన్నీళ్లతో చెల్లించే రొఖ్ఖం !!

★ ★ ★

మనసులు రెండు..
ముడులు మూడు...
అడుగులు ఏడు.......
బంధువులు వందలు.....
లాంఛనాలు లక్షలు.....
కట్నం కోట్లు దాటుతున్న వ్యవస్థలో
ఆధిక్యత దేనిదని ఆరా తీస్తున్నావా ...?
కంప్యూటర్‌నే కన్‌ఫ్యూజ్ చేస్తున్న లెక్కలవి.
పాపా... పాపా నువ్వెంత ??

★ ★ ★

తమస్సులో
తపస్సు చేసి
ఉషస్సుగా ఉదయించేది.:. అమ్మ !
అస్తమించేదీ... అమ్మే !!

★ ★ ★

నాకాళ్ళమధ్య జారిపడ్డవాడు
వాడి కాలెత్తి తన్నడానికి సిద్ధపడుతున్నాడు.

వాడూ... వీడూ తేడా దొరకని మగాడే !
'ముడుపు' తో తాళిగుత్తులను తగిలేసి మొగుడన్నవాడొకడు..
కడుపులోని తొలుతిత్తులను తొలుచుకొచ్చి
కొడుకన్న వాడొకడు ...
అధికారం... మగవాడి అనువంశిక తీర్పయింది !!

★ ★ ★

లోకంవాకిట తొలిఊయల అమ్మ
జోలపాటకి ఇలకోయిల అమ్మ
కవితలెన్నయినా చెప్పొచ్చు...
సూరీడు సైతం పొద్దుగుంకితే కునుకు తీస్తాడు.
చంద్రుడు నెలలో సగం రోజులు సెలవుపై వెళ్తాడు
అమ్మకి... ఆదివారం కూడా తప్పని ఓవర్‌టైమ్...
జీవితమంతా కనీసభత్యం లేని బాడ్‌టైమ్...

★ ★ ★

అప్పుడతడు...
కుక్కర్ విజిలేసినా అనుమానించేవాడు
కూని గజల్ విప్పినా గొంతుని శాసించేవాడు.
వంటగది కిటికీలోంచి... ఎగిరే విమానంవైపు
చూసినా రెక్కలు విరిచేవాడు...
ఓ బిడ్డకు తల్లయ్యాక కూడా
నా అమ్మతనాన్ని అనుమానంగా చూసేవాడు.
ఇప్పుడు వీడు...
సినిమాకి డబ్బులేవు కన్నా... అన్న
'నన్నెవరికి కన్నావ్... ఎందుకు కన్నావ్' అని మాటల ఈటెల్ని విసుర్తాడు.
అనుమానం పుట్టాక ఆడది పుట్టిందంటారు కాని...
అనుమానం పుట్టకముందే మగాడు పుట్టివుంటాడు.

★ ★ ★

వరకట్నం నించి మొదలు
బతుకంతా పీల్చినవాడు
కాంట్రాక్టుల సంతకాల2 కోసం
శరీరాన్ని తార్చినవాడు... స్కానింగుల్లో
ఆడపిల్లని తెల్సినప్పుడల్లా... అబార్షన్ పిల్స్
మింగించిన వాడు...
ఎదుగుతున్న సైన్సుని చూస్తుంటే
ఇప్పుడు ఇంటిముందు
వాడో బోర్డు తగిలిస్తాడేమోననీ భయమేస్తోంది.
అదే...
**"గర్భసంచి కిరాయి కివ్వబడును".**

★ ★ ★